
సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 29 । నవంబర్ । 2024

గాల్లో తేలినట్టుందే..



కైలాసగిరిపై అడ్వంచర్ స్పోర్ట్స్ అందుబాటులోకి వచ్చింది. జిప్ లైనర్, స్కై సైక్లింగ్ ఉపయోగించుకునేందుకు యువత పోటీ పడుతోంది. వీపీ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్ట్ నిర్వహిస్తుండగా.. ఇందులో ఒకదానికైతే రూ.300, రెండింటికి రూ.500 వసూలు చేస్తున్నారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ట్రయాంగులర్ సిరీస్‌కు విశాఖ అమ్మాయిలు



మహంతిశ్రీ



షబ్నం

దక్షిణాఫ్రికాతో జరిగే అండర్–19 మహిళల ట్రయాంగులర్ టీ–20 సిరీస్‌కు నగరానికి చెందిన ఇద్దరు అమ్మాయిలు ఎంపికయ్యారు. భారత ఏ జట్టుకు షబ్నం, భారత బీ జట్టుకు మహంతి శ్రీ ఆడనున్నారు. ఇటీవల స్టేట్ అండర్–19 మహిళల ప్రాబబుల్స్‌కు విశాఖ నుంచి యుహాసిని, సాయి హితేశ్వి, తమన్నా, మేఘన, ఆయూష, వైష్ణవి, శ్రీప్తిలతో పాటు షబ్నం, మహంతిశ్రీ ఎంపికయ్యారు. వుమెన్ అండర్–19 టీ–20 ట్రోఫీలో టాపార్డర్ బ్యాటర్‌గా ఆరు మ్యాచ్‌లాడి 95 పరుగుల అత్యధిక స్కోర్‌తో 248 పరుగులు చేసిన మహంతి ట్రయాంగులర్ సిరీస్‌కు ఎంపికైంది. ప్రస్తుతం ఆమె విశాఖ మహిళా కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. షబ్నం చెలరేగే బంతులు విసరనుంది. డిసెంబర్ 3వ తేదీ నుంచి పుణేలో జరగనున్న ఈ టోర్నీలో ఇండియా ఏ, ఇండియా బీ, దక్షిణాఫ్రికా జట్టు రెండేసి మ్యాచ్‌లు ఆడనున్నాయి. డిసెంబర్ 12న ఫైనల్స్ ఉంటుంది. - విశాఖ స్పోర్ట్స్



శ్రీనివాసుడికి దీపారాధన



ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో రెండో రోజైన గురువారం శ్రీనివాసుడికి లక్ష దీపోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా కృష్ణకిశోర్ చేతుల మీదుగా ఆకాశదీపాన్ని ఆవిష్కరించారు. అంబరీష దాస ఆధ్వర్యంలో తులసి హారతితో కార్యక్రమాన్ని ప్రారంభించి వివిధ సంగీత వాయిద్యాల మధ్య దామోదర అష్టకం ఆలపించారు. భక్తులు స్వయంగా వైకుంఠవాసుడికి, దామోదర కృష్ణుడికి నెయ్యి దీపాలతో హారతులిచ్చారు. అనంతరం హరేకృష్ణ వైకుంఠంలోని అన్ని దీపాలను వెలిగించి లక్ష దీపోత్సవం నిర్వహించారు. శ్రీకాంత్ రఘు గ్రూప్‌చే కృష్ణలీలలను కూచిపూడి నృత్య రూపంలో కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించారు. భక్తి పారవశ్యంతో భజన కార్యక్రమాలు నిర్వహించారు. చివరిగా భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

- తగరపువలస

అనంతుని దీపోత్సవం చూతము రారండి





దీపోత్సవానికి సిద్ధమైన అనంతుడి మెట్లు

రేపు అనంత పద్మనాభ స్వామి చెంత దివ్వెల కొలువు

సాయంత్రం 5.30 గంటలకు ఉత్సవం ప్రారంభం

ఉత్తరాంధ్ర ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం రానే వచ్చింది. రాష్ట్రంలో ఒక ప్రత్యేకతను సంతరించుకున్న ఈ ఉత్సవం ఈ నెల 30న నిర్వహించేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేసింది. దీపాలను ప్రత్యక్షంగా వెలిగించేందుకు.. వేడుకను కనులారా వీక్షించేందుకు ఆ రోజున పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు.

- పద్మనాభం

ఒకే చోట శైవ, వైష్ణవ ఆలయాలు ఉండడం పద్మనాభం ప్రత్యేకత. అందులోనూ కార్తీకమాసంలో శివ పూజకు అనువైన వాతావరణం కలిగి ఉండడంతో పాటు వైష్ణవ సంప్రదాయం కలిగిన అనంత పద్మనాభుడి గిరి మెట్ల పంక్తిపై శైవ సంప్రదాయాన్ని ప్రతిబింబించే దీపోత్సవం నిర్వహించడం.. అలనాటి శైవ, వైష్ణవ భక్తుల అద్భుతమైన అనుబంధాన్ని చాటి చెబుతుంది. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం ఉత్తరాంధ్ర సాంస్కృతిక వారసత్వానికి ఒక నిదర్శనం.

ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం

దీపోత్సవం శనివారం సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమవుతుంది. గిరిపైన జేగంట మోగగానే భక్తులు ఒక్కసారిగా దీపాలు వెలిగిస్తారు. శ్రీదేవి భూదేవి సమేతుడైన అనంత పద్మనాభ స్వామి చిన్న ఉత్సవ విగ్రహాలు గిరి దిగువున ప్రథమ పావంచా వద్ద కొలువు తీరుతాయి. గిరిని అధిరోహించే ముందు భక్తులు ప్రథమ పావంచా వద్ద కొలువై ఉన్న అనంతుడి ఉత్సవ విగ్రహాలను దర్శించుకుంటారు. గిరి ప్రథమ పావంచా సన్నిధిలో 12 అడుగుల ఎత్తు ఉన్న శివుని విగ్రహం సాక్షాత్కరిస్తుంది. గిరిపైకి వెళ్లే భక్తులు 1,200 మెట్టు వద్ద కొలువు దీరనున్న శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి పెద్ద ఉత్సవ విగ్రహాలను దర్శించుకుంటారు. ఉత్సవంలో భాగంగా మెట్లకు సున్నం వేశారు. మెట్లకిరువైపులా ఉన్న తుప్పలు, డొంకలు తొలగించారు.దీపాలు వెలగించడానికి అవసరమైన నూనె, 5 వేల ప్రమిదలు, 5 వేల ఒత్తులు సమకూర్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

గిరిపై ఆలయంలోకి ప్రవేశం లేదు

గిరిపై ఉన్న అనంత పద్మనాభ స్వామి ఆలయంలోకి, ఘాట్ రోడ్డు ద్వారా గిరిపైకి భక్తులకు ప్రవేశం లేదని నార్త్ ఏసీపీ ఎస్.అప్పలరాజు తెలిపారు. ఆలయ శిఖర పునర్నిర్మాణ పనులు జరుగుతున్నందున ఆలయంలోకి భక్తులకు ప్రవేశం లేదన్నారు. ఘాట్ రోడ్డుకు ఒక వైపు రక్షణ గోడలు లేకపోవడంతో రోడ్డు మార్గం ద్వారా భక్తులు వెళ్లకూడదని స్పష్టం చేశారు.

పద్మనాభం ప్రత్యేకత

అనంత పద్మనాభ స్వామి ప్రాచీన ఆలయాలు భారతదేశంలో రెండు చోట్ల ఉన్నాయి. అందులో ఒకటి కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం, రెండోది మన జిల్లాలోని పద్మనాభం గ్రామంలోని గిరిపై ఉంది. ఎక్కడా జరగని విధంగా ఏటా కార్తీక బహుళ అమావాస్య రోజున అనంత పద్మనాభ స్వామి కొండ మెట్ల పంక్తిపై దీపాలంకరణ ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. గిరి పాదం నుంచి గిరి శిఖరం వరకు 1,200 మెట్లకిరువైపులా తైల దీపాలంకరణ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించి.. హైందవ సంప్రదాయ విశిష్టతను ఎల్లెడలా వ్యాపింపజేస్తున్నారు ఈ ప్రాంత భక్త జనం. స్వామి వారి దీపోత్సవంలో పాల్గొంటే స్వర్గలోకం ప్రాప్తిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. మహిళలు తాము పుణ్యవతులు కావడానికి కార్తీక దీపోత్సవంలో పాల్గొనడమే ఉత్తమమని భావిస్తారు. అందుకే దీపోత్సవం రోజు మధ్యాహ్నం నాటికే వీరు పద్మనాభం చేరుకుని దీపాలు వెలిగించడానికి కొండ మెట్లను పోటీ పడి రిజర్వ్ చేసుకుంటారు.

దీపోత్సవానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు



అనంత పద్మనాభ స్వామి దీపోత్సవానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు నార్త్ ఏసీపీ ఎస్.అప్పలరాజు తెలిపారు. పద్మనాభం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 600 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని, ఇందులో 100 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉంటారన్నారు. గిరి ప్రథమ పావంచా వద్ద అగ్నిమాపక శకటం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రతీ 50 మెట్లకు అగ్ని మాపక సిబ్బంది ఉంటారన్నారు. కొండపైకి వెళ్లే సిమెంట్ రోడ్డుకిరువైపులా దుకాణాలు పెట్టవద్దని స్థానికులకు ఏసీపీ సూచించారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే

- గత ప్రభుత్వ హయాంలో బీసీలకు పెద్ద పీట
- వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్



పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, పార్టీ నాయకురాలు పేడాడ రమణకుమారి

డాబాగార్డెన్స్: వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే ఎంతో కృషి చేశారని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ కొనియాడారు. రాజ్యసభ పదవుల్లో బీసీలకు అవకాశం ఇచ్చారని తెలిపారు. జ్యోతిరావు పూలే వర్ధంతి పురస్కరించుకొని జడ్జికోర్టు సమీపంలో గల పూలే విగ్రహానికి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పలువురు పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూలే మార్గంలో నడుస్తూ బీసీలకు పెద్ద పీట వేశారన్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని, నామినేటెడ్ పదవుల్లో అగ్రస్థానం కల్పించారని, రాజ్యసభ పదవుల్లో బీసీలకు పెద్ద పీట వేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం పేదవాడికి సంక్షేమాన్ని దూరం చేసిందన్నారు. కూటమి పాలనకు మంగళవారం అప్పు రోజుగా మారిందని ఎద్దేవా చేశారు. ఆరు నెలల పాలనలో 60 వేల కోట్లకు పైగా అప్పులు తెచ్చారని, 2.5 లక్షల మంది వలంటీర్లను తొలగించారని, తొలి సంతకం పెట్టిన డీఎస్సీకి అతీగతీ లేదన్నారు. ఒక్క హామీని ఆరు నెలల కాలంలో నిలబెట్టుకోలేదని విమర్శించారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ పూలే సంస్కరణల్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ, మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పేర్ల విజయచందర్, కార్పొరేటర్లు పీవీ సురేష్, బిపిన్‌కుమార్ జైన్, కేవీ శశికళ, రెయ్యి వెంకటరమణ, గుండెపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణ్, లావణ్య కృష్ణారావు, శశికళ, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ షరీఫ్, పార్టీ న్యాయ విభాగం నాయకుడు నీలాపు కాళిదాసురెడ్డి, నియోజకవర్గం పరిశీలకుడు మొల్లి అప్పారావు, పార్టీ నాయకులు కొండా రాజీవ్ గాంధీ, పేడాడ రమణకుమారి, తిప్పల దేవన్‌రెడ్డి, డాక్టర్ జహీర్ అహ్మద్, పిల్లి సుజాత, పల్లా చిన్నతల్లి, అల్లంపల్లి రాజబాబు, డాక్టర్ తుల్లి చంద్రశేఖర్ యాదవ్, నడింపల్లి కృష్ణంరాజు, కంట్రెడ్డి రామన్నపాత్రుడు, జీలకర్ర నాగేంద్ర, సతీష్‌వర్మ, పీతల వాసు, అలపున కనకారెడ్డి, సనపల రవీంద్ర భరత్, వంకాయల మారుతీప్రసాద్, డాక్టర్ మూగి శ్రీనివాసరావు, సుజాత, నూకరాజు, దొడ్డి బాపూ ఆనంద్, బుల్లెట్ రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంఎస్‌ఎంఈల సర్వే

మహారాణిపేట: జిల్లాలో శుక్రవారం నుంచి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) సర్వే చేపట్టేందుకు జిల్లా పరిశ్రమల శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. భారత ప్రభుత్వం, ప్రపంచ బ్యాంక్ సహకారంతో ఈ సర్వే చేపడుతున్నట్లు పరిశ్రమల కేంద్రం జిల్లా జనరల్ మేనేజర్ వి.ఆదిశేషుతో ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎంఈలకు సమగ్ర మద్దతు అందించడంతోపాటు పోటీతత్వం, వ్యాపారం ప్రోత్సహించేందుకు మొబైల్ యాప్ ఆధారిత సర్వే ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ప్రతీ ఎంఎస్ఎంఈల వివరాలను ఉదయం(udyam) యాప్‌లో నమోదు చేయడం, కెపాసిటీ బిల్డింగ్, ఉత్పాదకత, ఆవిష్కరణను మెరుగుపర్చడం, ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాల గురించి ఎంఎస్ఎంఈలకు అవగాహన కల్పించడం, ఎంఎస్ఎంఈలతో పాలసీ నిర్ణయాలను రూపొందించడం, మార్కెట్ లింకేజీలు, క్రెడిట్ లింకేజీలు, క్రెడిట్ గ్యారెంటీ మద్దతు, నైపుణ్యం కలిగిన కార్మికుల డేటా తదితర అంశాలను నమోదు చేయడం సర్వే ముఖ్య ఉద్దేశాలుగా పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది సర్వే చేస్తారని వివరించారు.

వందేభారత్ రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం : వందే భారత్ రైళ్లకు త్వరలో అదనపు కోచ్‌లు జతచేయనున్నారు. ప్రస్తుతం 8 కోచ్‌లతో నడుస్తున్న సికింద్రాబాద్–విశాఖపట్నం–సికింద్రాబాద్(20707/20708) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 16 కోచ్‌లతో నడవనుంది. ప్రస్తుతం 16 కోచ్‌లతో నడుస్తున్న విశాఖపట్నం–సికింద్రాబాద్–విశాఖపట్నం (20833/20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ త్వరలో 20 కోచ్‌లతో నడవనుంది.

కిరండూల్‌కు అదనపు కోచ్‌లు : విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 1–స్లీపర్ క్లాస్ కోచ్, డిసెంబరు 6,8,10,12,14,16,18,20,22, 24,26,28,30, జనవరి 1వ తేదీల్లో 1–థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లను జతచేస్తున్నారు. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు 2వ తేదీ నుంచి జనవరి 1వ తేదీ వరకు 1–స్లీపర్ క్లాస్ కోచ్, డిసెంబరు 7,9,11,13,15,17, 19,21,23,25,27,29,31, జనవరి 2వ తేదీల్లో 1–థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జతచేస్తున్నారు.

చట్టబద్ధమైన దత్తతే ఆనందమయం

రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి



పోస్టర్ విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి, అధికారులు

బీచ్‌రోడ్డు: పిల్లలను విక్రయించినా, కార్మికులుగా మార్చినా కఠిన చర్యలు తప్పవని.. పిల్లలు కావాల్సిన వారు చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో గురువారం ఫోస్టర్ అడాప్షన్ పేరిట అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చట్టబద్ధం కాని దత్తత, పిల్లల విక్రయాలను నివారించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 27 శిశు గృహాల్లో 108 మంది పిల్లలు ఆశ్రయం పొందుతున్నారని తెలిపారు. గడిచిన కొంత కాలంలో 473 మంది పిల్లలను స్వదేశీ దత్తతకు, 114 మంది పిల్లలు విదేశీ దత్తతకు ఇచ్చినట్లు వెల్లడించారు. విదేశాలకు తీసుకెళ్లిన పిల్లలను కార్మికులుగా మార్చితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ 6 నుంచి 18 ఏళ్లలోపు పిల్లలు ఆరోగ్యంగా, ఆర్థికంగా ఎదగడానికి ఫోస్టర్ అడాప్షన్ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. తప్పిపోయిన పిల్లల గురించి 1098 చైల్డ్ హెల్ప్ లైన్లకు గానీ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ అంశాలపై ప్రతీ అంగన్‌వాడీ కార్యకర్త అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 159 పిల్లలను దత్తత ఇచ్చినట్లు చెప్పారు. ఏపీఎస్పీటీసీఆర్ చైర్మన్ అప్పారావు, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఆర్‌జేడీ చిన్మయిదేవి, జేడీ విజయ, పీడీ జి.జయాదేవి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రాధ పాల్గొన్నారు.

ఐదుగురు సీఐలకు స్థానచలనం



విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఇందులో రేంజ్‌కు పంపించిన ఒక సీఐ ఉత్తర్వును రద్దు చేయగా.. ఒక సీఐను రేంజ్‌కు సరెండ్ చేశారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రేంజ్ నుంచి వచ్చిన జి.ఉమామహేశ్వరరావును ఎయిర్‌పోర్ట్ లా అండ్ ఆర్డర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అక్కడ మూడు నెలలకు ముందు వరకు విధులు నిర్వర్తించిన వి.చక్రధరరావును ఆగస్టు 30వ తేదీన రేంజ్ వీఆర్‌కు పంపించారు. అయితే ఆ ఉత్తర్వును ప్రస్తుతం రద్దు చేసి వెనక్కి రప్పించి ద్వారకా సబ్ డివిజన్ క్రైమ్ సీఐగా పోస్టింగ్ కల్పించారు. అలాగే ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న డి.బంగారుపాపను విశాఖ రేంజ్‌కు సరెండ్ చేశారు. కొద్ది రోజుల క్రితం ఆక్సిజన్ టవర్స్‌లో ఒక ఫ్లాట్‌లో చోరీ కేసు విషయంలో పనిమనిషిని దారుణంగా హింసించిన ఘటన తీవ్ర దుమారం రేపింది. ఈ వ్యవహారంలో ఎస్ఐని సస్పెండ్ చేయడంతో పాటు సీఐ బంగారుపాపపై శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. ఈ కారణంగానే ఇప్పుడు ఈమెను రేంజ్‌కు సరెండర్ చేశారన్న టాక్ వినిపిస్తోంది. అదే విధంగా సోషల్ మీడియా సెల్ అండ్ సీఎంఎస్‌లో ఉన్న జి.అప్పారావును గోపాలపట్నం లాండ్ అండ్ ఆర్డర్‌కు, అక్కడ ఉన్న కె.సురేష్‌ను సోషల్ మీడియా సెల్‌కు బదిలీ చేశారు.

నేటి నుంచి 10వ క్రెడాయ్ ప్రోపర్టీ ఎక్స్‌పో



మాట్లాడుతున్న క్రెడాయ్ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: గాదిరాజు ప్యాలెస్ వేదికగా శుక్రవారం నుంచి 10వ క్రెడాయ్ ప్రోపర్టీ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. గాదిరాజు ప్యాలెస్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో క్రెడాయ్ విశాఖ చైర్మన్ కేఎస్ఆర్‌కే సాయి మాట్లాడారు. క్రెడాయ్ విశాఖపట్నం ఇప్పటికే 9 ప్రోపర్టీ ఎక్స్‌పోలను విజయవంతంగా నిర్వహించిందన్నారు. 10వ ప్రోపర్టీ ఎక్స్‌పో ఈ నెల 29, 30లతో పాటు డిసెంబర్ 1వ తేదీల్లో నిర్వహిస్తామన్నారు. 25 పెద్ద బ్రాండ్ బిల్డర్లతో సహా 71 ప్రాజెక్టులు ఈ ఎక్స్‌పో ద్వారా ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. రియల్ ఎస్టేట్, బ్యాంక్స్, స్టీల్ కంపెనీలు, సిమెంట్ ఇలా నిర్మాణ రంగానికి అవసరమైన అన్ని రకాల సంస్థలు ఈ ఎక్స్‌పోలో స్టాళ్లు ఏర్పాటు చేసి, వారి ప్రాజెక్టుల వివరాలు, ఆఫర్లను వినియోగదారులకు తెలియజేస్తాయన్నారు. వైస్ చైర్మన్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కాంక్షించే వినియోగదారులకు క్రెడాయ్ ప్రోపర్టీ ఎక్స్‌పో తొమ్మిదేళ్లుగా నమ్మకమైన, నాణ్యమైన భాగస్వామిగా నిలుస్తుందన్నారు. రానున్న రోజుల్లో నిర్మాణ రంగం అనుమతులు, రుసుంలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం మరింత సులభతరం చేయనుందన్నారు. ఇందుకు అనుగుణంగా క్రెడాయ్ వినతుల మేరకు ఈ నెల 30న రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవో విడుదల చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్యదర్శి వి.శ్రీను, కన్వీనర్ సీహెచ్ గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

విశాఖలీగల్: స్వల్ప వివాదంలో యువకుని హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ నగరంలోని నాల్గవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం.నాగేశ్వరరావు గురువారం తీర్పు ఇచ్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెట్ట ఖజానారావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు పి.గోవింద్ అప్పుఘర్ దగ్గర ఉంటున్నాడు. చిల్లర పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. మృతుడు చంద్రశేఖర్ సత్యం జంక్షన్ దగ్గర ఓ ఫ్యాబ్రికేషన్‌లో పనిచేస్తున్నాడు. 2022 డిసెంబర్ 3న డబ్బులు విషయంలో ఇద్దరు ఘర్షణ పడ్డారు. గోవింద్ ఇనుపురాడ్డుతో చంద్రశేఖర్‌ని బలంగా కొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంవీపీ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చారు.

గోప్యతలో మతలబేంటి?

షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్



తాగూర్ ఫార్మా ప్రమాద ఘటనలో రెండుకు పెరిగిన మరణాలు
ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 27 మంది కార్మికులు
ఎన్టీఆర్ ఆస్పత్రిలో 34 మంది కార్మికులకు స్క్రీనింగ్
వివరాలు వెల్లడించని అధికారులు, యాజమాన్యం

షిఫ్ట్‌లో 90 కార్మికులు

కంపెనీలో మొత్తం 236 మంది కార్మికులు, ఉద్యోగులు ఉండగా.. ప్రమాదం **జరిగినప్పుడు** షిఫ్ట్‌లో 90 మంది విధుల్లో ఉన్నారు. వీరిలో ఇద్దరు మృతి చెం**దగా మరో** 27 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో 34 మందికి ఎన్‌టీఆర్ ఆస్పత్రిలో స్క్రీనింగ్ పరీక్షలు చేశారు.

సాక్షి, అనకాపల్లి: పరవాడ జేఎన్ ఫార్మాసిటీలో తాగూర్ ఫార్మా కంపెనీ యూనిట్-3లో విషవాయువు లీకైన ఘటనలో అస్వస్థతకు గురైన వారి వివరాలు వెల్లడించడంలో కంపెనీ యాజమాన్యం, అధికారులు గోప్యత పాటిస్తున్నారు. ఇందులో మతలబుపై అనుమానాలు కలుగుతున్నాయి. ఈ ఘటనలో అస్వస్థతకు గురై కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందగా.. వేర్వేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి సంఖ్య 27కి చేరింది. ప్రస్తుతం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో 17 మంది కార్మికులు, మెడికవర్ ఆస్పత్రిలో 8 మంది కార్మికులు, మామ్స్ (అగనంపూడి) ఆస్పత్రిలో ఒకరు, కేర్ ఆస్పత్రిలో ఒకరు చికిత్స పొందుతున్నారు. అధికారులు మాత్రం ఈ విషయాన్ని ధ్రువీకరించడం లేదు.

ఫార్మా ఘటనలో ఆగిన మరో ఊపిరి

అక్కిరెడ్డిపాలెం: పరవాడలోని జవహర్‌లాల్ ఫార్మాసిటీలోని తాగూర్ ఫార్మా కంపెనీలో విషవాయువు లీకైన ఘటనలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. ప్రమాదంలో తీవ్ర అస్వస్థతకు గురైన ముగ్గురు కార్మికులను షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించగా ఒడిశా రాష్ట్రానికి చెందిన అమిత్ బాగ్ (23) చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. కంపెనీలో జూనియర్ మేనేజర్ (వేర్ హౌస్)గా పనిచేస్తున్న వీరశేఖర్ (34) గురువారం వేకువజామున మృతి చెందాడని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. కెమిస్టుగా పనిచేస్తున్న అగనంపూడికి చెందిన చిన్ని కృష్ణ (44)కు ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. వీరశేఖర్ మృతితో అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ అధికారులు, పోలీస్ సిబ్బంది, పరవాడ రెవెన్యూ అధికారులు షీలానగర్ కిమ్స్ ఆస్పత్రి వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఫార్మా ప్రమాద బాధితులకు కలెక్టర్ పరామర్శ

తాగూర్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో అస్వస్థతకు గురై షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పరామర్శించారు. గురువారం రాత్రి ఆయన ఆస్పత్రికి చేరుకొని క్రిటికల్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల కుటుంబాలతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

మృతులు అమిత్ బాగ్(23), వీరా శేఖర్(34)	ముండూరు భాస్కర్ ప్రదీప్	నల్ల భాస్కర్‌రావు	జి.వాసు	గొర్లె బానుప్రకాష్
చికిత్స పొందుతున్నవారు	కె.సంజీవ్	దనమిశెట్టి పాపారావు	చందన్ పటేల్	మంగవరపు బాలాజీ
కిమ్స్ ఐకాన్‌లో..	డి.రూనీస్ రాణి	గుర్రం శరత్‌కుమార్	శ్రీనివాసరావు	మాటా రెడ్డి
డి.చిన్ని కృష్ణ	కె.వెంకటరమణ	అల్లటిపల్లి అనిల్	ఎం.రమేష్	అగనంపూడి మామ్స్
గోపి రాజాశేఖర్ రెడ్డి	కె.పూర్ణ భవాని	బుగత వీరబాబు	బి.చిత్రదాస్	ఆస్పత్రిలో.. శ్రీకాంత్
	సట్టూరు త్రినాథరావు	చెంపన రాజారావు	జి.మురళి	కేర్ ఆస్పత్రిలో..
	మెడికవర్ ఆస్పత్రిలో..	ఎం. శివకుమార్	చప్పా ధనుంజయ్‌రావు	పిచ్చయ్య చౌదరి


తాగూర్ పరిశ్రమలో ప్రమాదం జరిగిన ప్రదేశం ఇదే..

కె.వి.ప్రసాద్‌కు సంగీత కళాసాగర బిరుదు


మృదంగం విద్వాంసుడు కె.వి.ప్రసాద్‌ను సత్కరిస్తున్న వీఎంఏ ప్రతినిధులు

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ ప్రతిష్టాత్మక సంగీత కళాసాగర బిరుదును చెన్నైకి చెందిన ప్రఖ్యాత మృదంగం విద్వాంసుడు కలైమామణి కె.వి.ప్రసాద్ అందించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో జరుగుతున్న వీఎంఏ 55వ వార్షికోత్సవంలో భాగంగా సన్మాన గ్రహీత ప్రసాద్‌కు బంగారు పతకం, జ్ఞాపిక, శాలువా, చందనమాలలతో వీఎంఏ ప్రతినిధులు సత్కరించారు. అనంతరం జరిగిన సంగీత సభలో మైసూరు బ్రదర్స్ ఎం.నాగరాజు, మైసూరు మంజునాథ్ వాయులీనవాద్యంతో రసజ్ఞులను ఆనందింపజేశారు. కె.వి.ప్రసాద్ మృదంగంపైన, శ్రీ ఘటం కార్తీక్ ఘటంపైన సహకరించగా కచేరీ రసవత్తరం సాగింది. అకాడమీ ఏటా అందించే అవార్డులను మృదంగం విద్వాంసులు ఎం.కామేష్ అందుకోగా, యువకళాకారుల సంగీతోత్సవంలో బెస్ట్ అవార్డును బెంగళూరుకు చెందిన శ్రీవిద్య అందుకున్నారు. అకాడమీకి అత్యున్నతమైన సేవలందించిన సహ కార్యదర్శి అయ్యగారి భుజంగరావును ఘనంగా సన్మానించారు. విజయనగరం ప్రభుత్వ సంగీత కళాశాల విద్యార్థులకు ఉపకార వేతనాలను అకాడమీ తరఫున అందించారు.

విశాఖలో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ శాఖ


ఇన్సూరెన్స్ శాఖను ప్రారంభిస్తున్న సంస్థ ఎండీ, సీఈవో నవీన్‌చంద్ర

విశాఖ సిటీ: దేశంలో ప్రముఖ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఒకటైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ ఇన్సూరెన్స్ నూతన శాఖ నగరంలో నవరత్న ట్రేడ్ సెంటర్‌లో గురువారం ప్రారంభమైంది. ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో నవీన్ చంద్ర ఝా చేతుల మీదుగా ఈ శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో తమ కార్యకలాపాలు విస్తరించడం సంతోషకరమన్నారు. ఇక్కడ అపారమైన అవకాశాలు ఉండడంతో పాటు నాణ్యమైన బీమా సేవలకు డిమాండ్ పెరుగుతోందని వెల్లడించారు. ఈ కొత్త శాఖలో ఆరోగ్యం, మోటార్, ప్రయాణం, ఇల్లు, వాణిజ్య బీమాతో పాటు సాధారణ బీమా ఉత్పత్తులు లభిస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ జీఎం హేమంత్‌కుమార్, ఆర్‌హెచ్ సౌత్-2 మనిరాజ్ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

130 మందికి రూ.12.99 లక్షల ఉపకార వేతనాల పంపిణీ

పరవాడ: ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యనభ్యసించాలని విశాఖ ఫార్మాసిటీ ఎండీ డాక్టర్ పి.పి.లాల్ కృష్ణ పిలుపునిచ్చారు. రామ్‌కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిరుపేద ప్రతిభావంతులైన 130 మంది విద్యార్థులకు రూ.12.99 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లాల్‌కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మంచి మార్కులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. రామ్‌కీ సీవోవో వాసుదేవరెడ్డి మాట్లాడుతూ రామ్‌కీ ఫౌండేషన్ ఏటా క్రమం తప్పకుండా వేతనాలు అందిస్తోందని, వీటిని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రామ్‌కీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.వి.రామిరెడ్డి మాట్లాడుతూ ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఉపకార వేతనాలు విద్యార్జన కోసం మాత్రమే ఖర్చుపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీజీఎం గిరిధర్ బక్షి, విశాఖ ఫార్మా సిటీ ఏజీఎం రాఘవరెడ్డి, రామ్‌కీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్ పాల్గొన్నారు.


ఉపకార వేతనాల చెక్కును అందిస్తున్న విశాఖ ఫార్మాసిటీ ఎండీ లాల్ కృష్ణ

యజమాని ఇంట్లో చోరీకి పాల్పడ్డ నిందితుల అరెస్ట్

- 13 తులాల బంగారం స్వాధీనం

పెందుర్తి: యజమాని దగ్గర పనిచేస్తూ అతని ఇంట్లోనే దొంగతనానికి పాల్పడిన ఇద్దరిని పెందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. విశాఖ క్రైమ్ జోన్-2 ఏసీపీ డి.లక్ష్మణరావు గురువారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెందుర్తిలోని కోటనరవకు చెందిన అందే అప్పారావు గోపాలపట్నంలో నూనె మిల్లు నడుపుతున్నారు. మిల్లులో పనివారు అవసరం కావడంతో తనకు తెలిసిన వారికి చెప్పగా అతని ద్వారా ఒడిశాలోని గంజాం జిల్లాకి చెందిన సంజయ్ గౌడ, రష్మితా నాయక్ భార్యా భర్తలమని చెప్పి పనిలో చేరారు. సంజయ్ నూనె మిల్లులో పనిచేస్తుండగా, రష్మిత అప్పారావు ఇంట్లో పనిచేస్తోంది. వీరిరువురూ అప్పారావు ఇంటి పక్కనే ఉన్న రేకుల షెడ్‌లోనే గడిచిన ఆరు నెలలుగా నివసిస్తున్నారు. అప్పారావు ఇంట్లో ఉన్న బంగారు నగలపై వీరి కన్నుపడింది. తమకు తెలిసిన ఒడిశాకి చెందిన జగన్నాథ్(జోగా)తో కలిసి అప్పారావు ఇంట్లో లేని సమయంలో దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటి తలుపులు విరగ్గొట్టి బీరువాని తెరచి నల్ల పూసల గొలుసు, బంగారు గొలుసు, లక్ష్మీదేవి హారం, చైన్, రెండు బంగారు గాజులు, నాలుగు జతల చెవిదిద్దులు, ఉంగరం, ఒక హారం, ఒక చైన్ లాకెట్, లక్ష్మీదేవి లాకెట్, ఒక కాయిన్ కలిపి మొత్తం 18 తులాల బంగారం, రూ.3 లక్షల నగదు దొంగిలించి ఒడిశాకి పారిపోయారు. అప్పారావు ఫిర్యాదు మేరకు ఈ ఏడాది జూన్ 11న పెందుర్తి క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. వెస్ట్ క్రైమ్ సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు జరిపి సంజయ్, రష్మితలను గురువారం అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు 13 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. జగన్నాథ్ ఆచూకీ కోసం గాలిస్తున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు, పెందుర్తి ఎస్ఐలు డి.సూరిబాబు, జె.రాజాబాబు, కానిస్టేబుల్ టి.శివప్రసాద్, గోపాలపట్నం కానిస్టేబుల్ జి.వి.వి.కిషోర్, ఎయిర్‌పోర్టు కానిస్టేబుళ్లు కె.నాగమణి, పి.పైడిరాజులను ఉన్నతాధికారులు అభినందించారు.

ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు రద్దు చేయాలి

విశాఖ విద్య : కాలయాపనతోపాటు బోధనకు ఆటంకం కలిగించే విధంగా ఉన్నటువంటి రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను తక్షణమే రద్దుచేసి ఉపాధ్యాయుల ప్రాణాలను కాపాడాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేడ్కర్ ఒక ప్రకటనలో కోరారు. విజయనగరం జిల్లా గజపతినగరంలో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణ కేంద్రంలో గురువారం ఓ ఉపాధ్యాయుడు గుండె పోటుతో మరణించడం పట్ల తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. ఈ మరణానికి బాధ్యులైన అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తూ భవిష్యత్తులో ఇటువంటి మరణాలు సంభవించకుండా ఉండేందుకు తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలన్నీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కలిసివచ్చే అన్ని ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

చెల్లని చెక్కు జారీ చేసిన వ్యక్తికి ఆరు నెలల జైలు

విశాఖ లీగల్: తన ఖాతాలో తగినంత నగదు లేకుండా చెక్కు జారీ చేసిన వ్యక్తికి ఆరు నెలల జైలు రూ.7.5 లక్షల జరిమానా విధిస్తూ నగరంలోని 5వ ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి సోమేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. ఫిర్యాది విశ్వనాథ రాకేష్ హైదరాబాద్ నివాసి. విశాఖలో స్థలం కొనడానికి ప్రయత్నం చేస్తుండగా.. వేచలపు నారాయణరావు పరిచయం అయ్యాడు. తాను శ్రీ సాయి షెల్టర్స్ పేరిట ఓ సంస్థ నిర్వహిస్తున్నానని తన వద్ద స్థలాలు ఉన్నాయని నమ్మబలికాడు. రాకేష్ వద్ద రూ.5 లక్షలు అడ్వాన్స్ తీసుకుని స్థలం ఇవ్వకుండా మోసం చేశాడు. దీంతో ఫిర్యాదీ న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. కేసు విచారణ జరిపిన న్యాయమూర్తి ఫిర్యాదీ వాదనతో ఏకీభవిస్తూ బాధితుడు చెల్లించిన రూ.5 లక్షలకు అదనంగా రూ.2.5 లక్షలు ఇవ్వాల్సిందిగా తీర్పులో స్పష్టం చేశారు. నారాయణరావు తన దగ్గర లేని స్థలాలకు చాలామంది వద్ద అడ్వాన్స్ తీసుకుని మోసగించినట్లు బాధితుడు రాకేష్ విలేకరులకు తెలిపారు.

6 నుంచి ఆర్టీసీ ఉద్యోగులకు క్రీడా పోటీలు

దాబాగార్డెన్స్: ఆర్టీసీ ఉద్యోగులకు వచ్చే నెల 6 నుంచి 8 వరకు క్రీడా పోటీలు కైలాసగిరి పోలీస్ క్రీడా ప్రాంగణంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్ ఆధ్వర్యంలో దేశంలోని అన్ని రాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొననున్నారు. ఈ మేరకు ఆర్టీసీ జోన్-1 ఇన్‌చార్జి ఈడీ విజయ్‌కుమార్ ఆర్టీసీ అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీలతో గురువారం ఎంవీపీ బస్ స్టేషన్, ఈడీ క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో సీఎంఈ(ఎం) జి.విజయరత్నం, విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా అధికారి కె.పద్మావతి, విజయనగరం జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ, విశాఖపట్నం డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సత్యనారాయణ, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ ఎం.సుధాబిందు, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు, కమిటీల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

'అఖిల భారత డిజిటల్ క్విజ్ పోటీల్లో పాల్గొనండి'



మహారాణిపేట: యువత భాగస్వామ్యం కోసం భారత ప్రభుత్వం వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ పేరిట కొత్త వేదికను ప్రారంభించినట్లు నెహ్రూ యువ కేంద్రం(ఎన్‌వైకే) జిల్లా యువ అధికారి జి.మహేశ్వరరావు తెలిపారు. 2025 జనవరి 11, 12 తేదీల్లో జాతీయ యువజనోత్సవం సందర్భంగా వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఇది నాలుగంచెల పోటీ అని, నవంబర్ 25న వికసిత భారత్ చాలెంజ్ పేరిట అఖిల భారత డిజిటల్ క్విజ్ పోటీలు ప్రారంభమయ్యాయని చెప్పారు. డిసెంబర్ 5 వరకు జరిగే ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో యువత పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు https:// mybharat. gov. in/ ను సందర్శించాలని సూచించారు.

1న జేఎన్‌టీయూకే అలుమ్ని సమావేశం

ఎంవీపీకాలనీ: డిసెంబర్ 1వ తేదీన జేఎన్‌టీయూ కాకినాడ అలుమ్ని సమావేశం ఎంవీపీ కాలనీలోని ఐఏఎం వేదికగా జరగనుందని అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బి.అప్పలనాయుడు తెలిపారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలతో పాటు ఎన్ఆర్ఐలుగా ఉన్న అలుమ్ని విద్యార్థులంతా ఈ సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం : దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు భద్రతా పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. డిసెంబరు 6న పూరీ-యశ్వంత్‌పూర్(22883) ఎక్స్‌ప్రెస్, డిసెంబరు 7న యశ్వంత్‌పూర్-పూరి(22884) ఎక్స్‌ప్రెస్, డిసెంబరు 4, 11వ తేదీల్లో హౌరా-యశ్వంత్‌పూర్(22831) ఎక్స్‌ప్రెస్, డిసెంబరు 6,13వ తేదీల్లో యశ్వంత్‌పూర్-హౌరా(22832) ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించబడిన మార్గంలో వయా నంద్యాల, యర్రగుంట్ల, గుత్తి, అనంతపూరు మీదుగా నడుస్తాయి.

జీవీఎంసీ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా మనీషా త్రిపాఠి

అల్లిపురం: జీవీఎంసీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా అనకాపల్లి సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్(రిటైర్డ్), డిప్యూటీ కెప్టెన్ మనీషా త్రిపాఠిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో త్రిపాఠి ఏడాది పాటు ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొంది.

రాజమహేంద్రవరానికి అప్పన్న ప్రచార రథం


రథాన్ని ప్రారంభిస్తున్న ఏఈవో ఆనంద్‌కుమార్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన ప్రచార రథం గురువారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి తరలివెళ్లింది. రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈనెల 28, 29 తేదీల్లో జరిగే ఆధ్యాత్మిక వేడుకల్లో భక్తుల దర్శనార్థం రథాన్ని పంపించారు. దేవస్థానం ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ కొబ్బరికాయ కొట్టి రథాన్ని ప్రారంభించారు.

నగర అభివృద్ధి ప్రాజెక్ట్‌లపై ప్రత్యేక దృష్టి


- స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లపై కలెక్టర్ సమీక్ష


మహారాణిపేట: గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులపై కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సమీక్షించారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులు, భవిష్యత్‌లో చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ కలెక్టర్ చాంబర్‌లో గురువారం సమావేశమయ్యారు. భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. నూతనంగా చేపట్టాల్సిన పనులపై తగిన సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగర సుందరీకరణ, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉందన్నారు. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ కొంతమంది ఇటీవల మారినట్లు కంపెనీ సెక్రటరీ కుసుమాంబ, సీఎఫ్‌వో ఆనంద్.. బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ముందు ఉంచగా ఆమోదం తెలిపారు. ఈ క్రమంలో కంపెనీ సెక్రటరీ అజెండా అంశాలను చదివి వినిపించారు. కొన్ని అంశాలను యథావిధిగా ఆమోదించిన బోర్డు ఆఫ్ డైరెక్టర్స్.. కొన్ని అంశాల్లో మార్పులు చెప్పారు. నగరంలో ముఖ్య కూడళ్ల అభివృద్ధి, సుందరీకరణ, తాగునీటి సదుపాయం మెరుగుదల, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి కార్యకలాపాలను వేగవంతం చేయాలన్నారు. ఆమోదం మేరకు నూతన పనులను చేపట్టాలని, నిర్దిష్ట కాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జీవీఎంసీ సీఈ శివప్రసాద్ రాజు, ఏడీసీ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

జోన్-2 ఇన్‌చార్జి జెడ్సీగా ఫణిరాం

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్-2 ఇన్‌చార్జి జోనల్ కమిషనర్‌గా ఎంవీవీ ఫణిరాం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జెడ్సీగా పనిచేస్తున్న పొందూరు సింహాచలం ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించిన కేసులో అరెస్ట్ అయి, రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ మేరకు ప్రధాన కార్యాలయంలో డీపీవో బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఫణిరాంకు జోన్-2 జెడ్సీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయనకు జోనల్ కార్యాలయం అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి.. శుభాకాంక్షలు తెలిపారు. ఫణిరాం డీసీఆర్‌గా, జీవీఎంసీ కార్యదర్శిగా, పీఆర్‌వో విభాగం ఇన్‌చార్జిగా, యూసీడీ పీడీగా, విశాఖ మ్యూజియం ఇన్‌చార్జిగా, పలు చోట్ల కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉంది.


ఫణిరాంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యాలయం అధికారులు, సిబ్బంది


పూలే విగ్రహం నివాళులర్పిస్తున్న కలెక్టర్

జ్యోతిరావు పూలేకు నివాళి

మహారాణిపేట: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా నౌరోజీ రోడ్డులో గల ఆయన విగ్రహానికి గురువారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏడీసీ రమణమూర్తి, బీసీ సంక్షేమ అధికారిణి శ్రీదేవి, బీసీ సంఘం ప్రతినిధి పితాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి తత్వాన్ని చాటిచెప్పిన వేద సభ

సింహాచలం: సింహగిరిపై గురువారం వేదసభని ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో జరిగిన సభలో రుగ్వేదం, శుక్ల యజుర్వేదం, కృష్ణ యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేద పండితులు తమ పాండిత్యాన్ని ప్రదర్శించారు. వరాహ లక్ష్మీనృసింహస్వామి వైభవాన్ని చాటిచెప్పారు. దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు జరిగిన ఈ వేదసభ ఆద్యంతం భక్తి భావాన్ని, భక్తితత్వాన్ని చాటిచెప్పింది. రుగ్వేద పండితులు కార్తికేయ భట్, వీవీఎస్ శ్రీనాథ్, అధర్వణ వేద పండితులు చిట్టిళ్ల లక్ష్మీనరసింహశర్మ, ఆర్.రవితేజ, సామవేద పండితులు వేదుల భువనేశ్వరప్రసాద్, ఎస్ఎస్ తేజ్, శుక్ల యజుర్వేద పండితులు హెచ్.అమరేశ్వరశర్మ, ఎం.సంతోష్‌కుమార్, కృష్ణ యజుర్వేద పండితులు ముష్టి వెంకటేశ్వర ఘనాపాఠి తదితరులు పాల్గొన్నారు.


సభ నిర్వహిస్తున్న వేద పండితులు